

ప్రాజెక్టులకు మహర్దశ



- ‣ డ్రిప్ కింద జిల్లాలో మూడు ప్రాజెక్టుల ఎంపిక
- ‣ స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు భారీగా కేంద్ర నిధులు
- ‣ ఇకపై పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు
- ‣ రాష్ట్ర సర్కారు నిధులు మంజూరు చేయడంతో కడెంకు మినహాయింపు


స్వర్ణప్రాజెక్టు ఇదే

నిర్మల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ద్వారా అమల వుతున్న డ్రిప్ (డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్ట్) కింద జిల్లాలోని మూడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు డ్రిప్ ఆర్థిక సహకారం కోసం ప్రతిపాదనలు పంపగా.. ఆ ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కేంద్రప్రభుత్వ ఆర్థిక సహకారంతో కొనసాగనున్న ఈ పథకంతో జిల్లాలోని మూడు ప్రాజెక్టులకు ఇక మహర్దశ పట్టనుంది. ఒక్కో ప్రాజెక్టుకు రూ.16 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలపై డ్రిప్ అధికారులు ఆమోదముద్ర వేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. కాగా రాష్ట్రప్రభుత్వం వరద పరిస్థితి తీవ్రతను పరిగణలోకి తీసుకొని కడెం ప్రాజెక్టుకు దాదాపు రూ.5 కోట్లను విడుదల చేయడమే కాకుండా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన మరమ్మతులను పూర్తి చేసింది. అలాగే మిగతా రూ.11 కోట్లను కూడా విడుదల చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉండడంతో ఈ ప్రాజెక్టుకు డ్రిప్ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. మొదట రాష్ట్రప్రభుత్వం కడెం ప్రాజెక్టుకు నిధుల విడుదల విషయంలో దోబూచులాడిన కారణంగా ఈ ప్రాజెక్టును డ్రిప్ నిధుల కోసం ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల మేరకు డ్రిప్ స్వర్ణ,గడ్డెన్నవాగు ప్రాజెక్టులతో పాటు కడెం ప్రాజెక్టును కూడా ఎంపిక చేసింది. అయితే అంతలోనే ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం ఆ నిధులతో మరమ్మతులు పూర్తయినందున ఈ ప్రాజెక్టును డ్రిప్ నుంచి పక్కన పెట్టారు. ప్రస్తుతం కడెం, స్వర్ణ ప్రాజెక్టులకు ఒక్కో ప్రాజెక్టుకు గాను రూ.16 కోట్ల నిధులు మంజూరు కానున్నాయి. ఈ నిధులతో ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు, కొత్త కరకట్టల నిర్మాణం, కట్ట రిపేర్లు, కొత్తగేట్లను ఏర్పాటు చేయడం లాంటి పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టుల ఆనకట్టలను బలోపేతం చేసి వరద ఉధృతి నుంచి వాటిని కాపాడడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. దీంతో పాటు కాలువల మరమ్మతులు కూడా చేపట్టి నీటివృధాను అరికడుతూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని తలపెట్టారు.

కడెం ప్రతిపాదనలు నిరాకరణ

కాగా డ్రిప్ కింద అన్ని ప్రాజెక్టుల తరహాలోనే కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.16 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి పంపారు. అయితే అప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కడెంపై ప్రత్యేకదృష్టి సారించి నిధులను మంజూరు చేసింది. నిధులతో గేట్ల మరమ్మతులు, కౌంటర్ వేటర్‌ల బిగింపు, గ్రీసింగ్, ఎలక్ట్రిఫికేషన్ లాంటి పనులను పూర్తి చేసి వర్షాకాలం నాటికి ప్రాజెక్టును సిద్ధం చేశారు. అయితే అదనపు గేట్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయనున్న కారణంగా కడెం ప్రాజెక్టును డ్రిప్ నుంచి తప్పించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలను సంబంధిత అధికారులు పక్కన పెట్టారు. ప్రస్తుతం రెండు ప్రాజెక్టులకే డ్రిప్ ద్వారా నిధులు మంజూరుకానున్నాయి.

కడెం, గడ్డెన్న వాగులకు..

ఇదిలా ఉండగా డ్రిప్ పథకం కింద ఎంపికైన కడెం, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుంది. గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు మొత్తం రూ. 18 కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. రూ.18 కోట్లతో ప్రాజెక్టు గ్యాలరీలో ఉన్న నీటిని తొలగించడమే కాకుండా కొత్త కరకట్టల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే ప్రస్తుతం ఉన్న కట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు స్వర్ణ ప్రాజెక్టుకు రూ.9 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నిధులు మంజూరు కాగానే ప్రాజెక్టుకు సంబంధించి కొత్తగా ఆరు గేట్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే కాలువల మరమత్తులు, గేట్ల మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టును మరింత బలోపేతం చేయాలని భావిస్తున్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

డ్రిప్ పథకం కింద స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయబోతున్నందున ఆ ప్రాజెక్టుల కింద సాగయ్యే చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అలాగే ఇప్పటికే కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టిన కారణంగా ఆ ప్రాజెక్టు ద్వారా నీరు పంట పొలాలకు అందుతోంది. రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యాన్ని, వరద ఉధృతి ప్రవాహాన్ని పక్కాగా తెలుసుకుంటున్న కారణంగా నీటి వృధా అరికడుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టును డ్రిప్ నుంచి తప్పించినప్పటికీ రాష్ట్రప్రభుత్వం మరిన్ని నిధులు మంజూరు చేయనున్న కారణంగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందనుంది. అలాగే గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందించే అవకాశాలు మెరుగుకానున్నాయని అంటున్నారు. మొత్తానికి డ్రిప్ పథకం ద్వారా జిల్లా ప్రాజెక్టులకు మహర్దశ పట్టనుందని అంటున్నారు.


కడెం ప్రాజెక్టు ఇదే

ఘనంగా ప్రారంభమైన

అయ్యప్ప ఆలయ ఏడో వార్షికోత్సవ వేడుకలు


అయ్యప్ప ఆలయంలో హోమంలో పాల్గొన్న దంపతులు

భైంసా, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి) ; రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీలో గల అన్నపూర్ణ క్షేత్ర అయ్యప్ప ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని లక్ష్మీగణపతి రుద్ర సహిత చండీ సప్తశతి యాగం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి సాయినాథ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు గణపతిపూజ, అఖండ దీపాస్థాపన, కంకణదారణ, అవాహిత హోమం, చండీ హోమం, రుద్ర హోమం, వేద పారాయణం నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు భైంసా పట్టణ భక్తులతో పాటు పరిసరా ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలువురు దంపతులు చండీ హోమంలో పాల్గొని పూజలు చేశారు.

సిద్దులకుంటలో పత్రీజీ జన్మదిన వేడుక


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్త

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పిరమిడ్స్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో సుభాష్ పత్రీజీ మహా అవతరణ దినోత్సవం సందర్భంగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణా రెడ్డి తెలిపారు. సోమవారం సోన్ మండలం సిద్దులకుంట గ్రామంలో నాలుగో రోజు పత్రీజీ జన్మదిన వేడుక నిర్వహించారు. ఈ నెల 11న పత్రీజీ మహా అవతరణ సందర్భంగా 11 మండలాల్లో వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ధ్యానం చేశారు. శాఖాహార విశిష్టత వివరించారు. ధ్యాన శాఖాహార పిరమిడ్ విశిష్టత తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మాజీ సర్పంచ్ భూమారెడ్డి, పిరమిడ్ మాస్టర్లు ఏ. శ్రీనివాస్, నారాయణ, 500ల మంది ధ్యాన బంధువులు పాల్గొన్నారు. అన్నప్రసాదాన్ని అందజేశారు.

కుంటాల మండలంలో మరోసారి పులిదాడి

కుంటాల, నవంబర్, 4 : (ఆంధ్రజ్యోతి) : మండలంలో గత మూడు రోజుల నుంచి పులి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంది. శని, ఆదివారాల్లో సూర్యాపూర్, మెదన్‌పూర్ అటవీ ప్రాంతాల్లో సంచరించిన పులి ఇదివరకే పులి దాడిలో ఒక లేగదూడ ఆవు మృతి చెందాయి. అటవీశాఖ అధికారులు ఈ రెండు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ పులి సంచరిస్తున్న ప్రదేశంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తాజాగా సోమవారం అంబుగాం శివారులో పులి సంచరించడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.


పులిదాడిలో గాయపడ్డ ఆవు

జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి బదిలీ

- కొత్త డీఈవోగా నాగజ్యోతి



నిర్మల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డీఈవో డాక్టర్ రవీందర్ రెడ్డిని బదిలీ చేస్తూ విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి సోమవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. డాక్టర్ రవీందర్‌రెడ్డి స్థానంలో నిజామాబాద్ డీఈవో ఆఫీస్‌లో ఏడీగా విధులు నిర్వహిస్తున్న నాగజ్యోతిని నిర్మల్ ఎఫ్ఏసీ డీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్


దిలావర్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాడన్న కారణంతో నిర్మల్ పట్టణంలోని బాగులవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి విజయ్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గత కొంత కాలంగా ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల రైతులు, గ్రామస్థులు ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉద్యమానికి పరోక్షంగా, అవసరమైతే ప్రత్యక్షంగా విజయ్‌కుమార్ మద్దతు ఇస్తున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో విజయ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో రవీందర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

'సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలి'

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆరెపల్లి విజయ్ కుమార్‌పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలని దిలావర్‌పూర్ ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు కూడా ప్రజలలో ఒక్కరని, వారికి కూడా సామాజిక బాధ్యత ఉంటుందన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల కాలుష్యంతో దిలావర్‌పూర్ పరిసరాలు కాలుష్యంతో నిండిపోయి నేల, గాలి నిర్వీర్యం అవుతుందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే పరిష్కారం చూపకుండా ఒక ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం మా సంఘం తరఫున పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని టీటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్ అన్నారు. విజయ్ కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తి వేయడంతో పాటు ఇథనాల్ సమస్యకు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

రైతాంగానికి కేంద్ర సర్కారు పెద్దపీట

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పటేల్


సీసీఐ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

భైంసా, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి) ; ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. సోమవారం భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొదటగా పత్తి తీసుకోచ్చిన రైతుకు ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ పాలకవర్గ సభ్యులు, వ్యాపారులు, అధికారులు ఘనంగా సన్మానించి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్‌లో పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్రప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్, వైస్ ఛైర్మన్ ఫారూక్ అహ్మద్, డైరెక్టర్లు తోట రాము, దత్తురాం పటేల్, రాంనాథ్, పీఏసీఎస్ ఛైర్మన్ దేవేందర్‌రెడ్డి, మార్కెట్ సెక్రెటరీ పుర్యానాయక్, శ్రీనివాస్, నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కుంటాల, నవంబర్, 4 : (ఆంధ్రజ్యోతి) : ఆలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్ అన్నారు. సోమవారం కుంటాల మండలంలోని కల్లూరు దత్తవెంకటసాయి ఆలయ ముఖద్వారం, ప్రహరీ గోడ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖ నిధులు రూ. 45 లక్షలతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల నుంచిన సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీలలో లోడ్ చేయించి కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతీఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో సరిపడినన్ని తూకపు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. టార్పాలిన్, ధాన్యపు బస్తాలను కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని సూచించారు. తూనికలు కొలతలశాఖ తూకపు యంత్రాలకు స్టాంపింగ్ చేసి సంబంధిత సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యల దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని, పరిష్కారానికి సంబంధించిన వివరాలను సంబంధిత దరఖాస్తు దారుడికి అందజేయాలన్నారు. అలాగే జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, గన్ని బ్యాగ్స్, టార్పాలిన్, వేయింగ్ మిషన్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ హాస్టల్‌ను నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 6న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేర్ల నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందని, అర్హులైన ప్రతీ ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్


జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. గోదాం నిర్వహణ, తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, భద్రత సిబ్బంది, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అవినీతిపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్స్ రైట్స్ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. తనిఖీ రిపోర్టులను అందజేశారు. ఎం. శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, లింగన్న, ఫణీంద్రకుమార్, ఇమ్రాన్‌ఖాన్, భోజన్న, నితీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి కుటుంబాన్ని

పరామర్శించిన మాజీ మంత్రి


న్యాయమూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి తండ్రి జువ్వాడి సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఇంద్రకరణ్‌రెడ్డి న్యాయమూర్తి స్వగ్రామం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లి శ్రీదేవి, శ్రీహరిరావు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు నాయకులు లోక భూమారెడ్డి, అల్లోల మురళీధర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, తదితర నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

పోలీసుల సేవలు వినియోగించుకోండి

- ఎస్పీ జానకి షర్మిల


సమస్యలు వింటున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు పోలీసుల సేవలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల కోరారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యలు ఓపికగా విని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసులు శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ప్రజల మన్ననలు పొందేలా పని చేస్తున్నారన్నారు. ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మండీ చికెన్ బిర్యానీ తిని

13 మందికి తీవ్ర అస్వస్థత


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

నిర్మల్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని ఖానాపూర్ రోడ్డులో గల ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి మండి చికెన్ బిర్యానీ తిన్న 13 మంది ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారు. చికెన్ బిర్యానీ తిన్న తర్వాత వీరందరికీ వాంతులు, విరేచనాలు కావడంతో వీరందరినీ నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నుండి కొంతమంది ఖానాపూర్ వాసులు కాగా నిర్మల్‌కు చెందిన అస్లాం, హుస్సేన్, షేక్ బాబా, షేక్‌జాకీర్, సైఫ్ తదితరులు ఈ హోటల్‌లో మండి బిర్యానీ తిని అస్వస్థతకు గురయ్యారు. కాగా వీరిలో నుంచి కొంత మంది సోమవారం మ. ధ్యాహ్నం కోలుకోవడంతో వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కాగా మరో ఆరుగురు ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కల్తీ చికెన్ బిర్యానీ కారణంగానే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

దస్తురాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలం లోని మున్యాల్ గ్రామానికి చెందిన సీమల శృతి (24) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధ పడుతుంది. ఈ క్రమంలో ఈ నెల 2న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తండ్రిని హత్య చేసిన సంఘటనలో నేరస్థుడికి జీవితఖైదు శిక్ష, వేయి రూపాయల జరిమానా వేస్తూ ప్రిన్సిపల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. ఎస్పీ ఈ విషయాన్ని ప్రకటించారు. అప్పాల అవినాష్ తండ్రిని పెళ్లి చేయమని ఒత్తిడి చేయగా పెద్ద కొడుకు పెళ్లి చేసిన తరువాత చేస్తానన్నారు. 13 జూన్ 2022న తండ్రితో గొడవ పడి కత్తితో దాడి చేసి కిరాతకంగా నరకడంతో మృతి చెందాడు. మృతుడి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, సీఐ శ్రీనివాస్ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన వారిని ఎస్పీ అభినందించారు. నేరం చేసినవారు శిక్ష నుండి తప్పించుకోలేరని ఎస్పీ అన్నారు. చట్టాన్ని అతిక్రమించవద్దని సూచించారు.

ముగిసిన సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ, అసోసియేషన్ సభ్యులు

ఆసిఫాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల పాఠశాలలో మూడురోజులుగా పీడీ సదానందం జ్ఞాపకార్థం జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. మహబూబ్‌నగర్ జట్టు, ఆదిలా బాద్ జట్టు ఫైనల్‌లో తలపడగా ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. విజేతలకు బహుమతులను పట్టణ సీఐ రవీందర్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, హ్యాండ్‌బాల్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్, మాజీఎంపీపీ మల్లికార్జున్, క్రీడాధికారి మీనారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ బహుమతులు అందజేశారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

సిరికొండ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం, టిప్పర్‌ను ఢీకొన్న ఘటన సిరికొండ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై నవీన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామానికి చెందిన జాదవ్ విజయ్(16), ద్విచక్ర వాహనంపై సిరికొండ నుంచి వాయిపేట్ వెళ్తున్న క్రమంలో చిమ్మన్‌గుడి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్ పై ఉన్న విజయ్ ఎడమ కాలు విరిగిపోగా, తలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌గౌడ్ పేర్కొన్నారు.

సమగ్ర సర్వేలో లోపాలు లేకుండా చూడాలి

తాంసి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని తప్పులు లేకుండా చేయాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ పాఠశాలలో సర్వే నిర్వహించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి కుటుంబం వివరాలను సేకరించాలన్నారు. ఉపాధ్యాయులు వారి వారి విధులను బాధ్యతగా నిర్వహిస్తూ వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు.

తలమడుగు : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాల్లో తహసీల్దార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం :

ఉట్నూర్, నవంబర్4 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్ నివాసంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర యువ నాయకులు రాథోడ్‌రితేష్ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రారంభిం చారు. కార్యక్రమంలో ఉట్నూర్ మండల కన్వీనర్ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శిబింగి వెంకటేశ్, గిరిజన మోర్చ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన రితేష్‌రాథోడ్

ప్రమాదకర ప్రయాణం



కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ఇచ్చోడ, నవంబరు, 4(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం సమీపంలో రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇచ్చోడ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు పెరిగింది. దీంతో రోడ్డుపైనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ఎక్కన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ రోడ్డు గుండా ఉన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన రోడ్డు భవనాల శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా పనులు కొనసాగిస్తుండటం గమనార్హం. నిత్యం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్న ప్రధాన రహదారిపై పట్టింపులేకుండా పనులు కొనసాగించడంపై వాహనదారులు, పాదచారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా ఆలోచించి రోడ్డు విస్తరణ పనులు చేప ట్టాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రిపూట ప్రయాణం చేస్తే ప్రమా దం బారిన పడే అవకాశముంది.

ఇసుక రీచ్‌లపై మాఫియా కన్ను

(5వ పేజీ తరువాయి...)

ఉండి మరీ ఈ దందాను కొనసాగిస్తున్నారు. కొందరు నేతలైతే సర్పంచ్, ఎంపీటీసీలుగా గెలుస్తూ ఇసుక దందానే ప్రధాన ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో మళ్లీ ఎన్నికల్లో గెలుపొందుతూ చక్రం తిప్పుతున్నారు. మండలస్థాయి అధికారులపై ఒత్తిళ్లు చేస్తూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డురాకుండా జాగ్రత్త పడుతున్నారు. కాదు కూడదంటే బదిలీ వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు తహసీల్దార్లు, ఎస్సైలపై ఇసుక మాఫియా బదిలీ వేటు వేయించిన దాఖలాలు ఉన్నాయి. ప్రధానంగా జైనథ్ మండలం డొలారా, పెండల్‌వాడ, కౌఠ గ్రామాలతో పాటు భీంపూర్ మండలం వడూర్, బేల మండలం కాంగాన్‌పూర్, సాం గిడి, కొగ్దూరు, మణియార్‌పూర్ గ్రామాలలో ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష నేతలు ఒక్కటై అక్రమ దందాను బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న కట్టడి చేయాల్సిన అధికారులే కళ్లు మూసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

సర్వే పనులు కేటాయించారని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

తలమడుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి, కుటుంబ సర్వే పనులు అధికారులు అడ్డగోలుగా కేటాయించారని అధికారులతో ఉపాధ్యాయులు, ఎనిమినేటర్లు ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ కొంత మంది ఉపాధ్యాయులకు 20 కేటాయించగా, మరికొంత మంది ఉపాధ్యాయులకు 175 ఇండ్లు కేటాయించారన్నారు. ఇది ఎక్కడిది న్యాయమని ఎంపీడీవోతో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా ఇప్పటికే ప్రభుత్వ బడులకు విద్యార్థులు దూరమవుతుంటే ఈ సర్వే వల్ల ఉపాధ్యాయులు పిల్లలకు చదు వులకు ఆటంకాలు ఎదురవుతాయన్నారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వేను ఒక రోజే నిర్వహించగా ఇప్పుడు 15 రోజులుసర్వే నిర్వహించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వారు వాపోయారు. అంతేకాకుండా సర్వే నిర్వహించే అధికారులకు రెమ్యూనరేషన్ ఎంత ఇస్తారో వెల్లడించలేదన్నారు. సర్వే చేసిన అధికారులే ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, సాధ్యం కాదన్నారు.

బంజారాలు ఐక్యతతో మెలగాలి

నార్నూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : బంజారాలు ఐక్యతతో మెలగాలని నార్నూర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బిగజానంద్‌నాయక్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం గ్రామ పంచాయతీ సమావేశహాల్‌లో ఆయన మాట్లాడుతూ బంజారా సమస్యల పరిష్కారం పై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోఈ నెల 6వ తేదీన నిర్వహించనున్న సమావేశానికి బంజారా సమాజ ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జేఏసీ చైర్మన్ ఉత్తంరాథోడ్, జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి, నాయక్‌పాక్స్ ఇన్‌చార్జీ చైర్మన్ సురేష్, ఆడే మండల అధ్యక్షులు చంద్రశేఖర్, పెసా చైర్మన్ సికిందర్‌రాథోడ్ పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయాలని వినతి

ఆదిలాబాద్‌రూరల్, నవంబర్ 04 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన వితంతువులకు, వృద్ధులు, వికలాంగులకు పింఛన్ మంజూరు చేయాలని మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను బాధితులతో కలిసి విన్నవించారు. ఐదు సంవత్సరాలుగా వీరికి పింఛన్ రావడం లేదని వాపోయారు. ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వీరికి ఇప్పటి వరకు పింఛన్ మంజూరు కాలేదన్నారు. దీంతో వీరి జీవనవిధానం భారంగా మారిందని, న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

బోథ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోనాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేశ్‌ముఖ్ సచిన్ తెలిపారు. విద్యార్థులు సాయంత్రం 4.15 నిమిషాల నుంచి 5 గంటల 15 నిమిషాల వరకు గంట పాటు ప్రత్యేక తరగతులు హాజరుకావాలని సూచించారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధికి ప్రాధాన్యత

● మాజీ మంత్రి జోగురామన్న ● కమిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ

ఆదిలాబాద్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ నాయకత్వంలో ఆధ్యాత్మికంతో పాటు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించడం జరిగిందని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని శాంతినగర్‌లోని హనుమాన్ ఆలయం కమిటీహాల్ నిర్మాణానికి మాజీమంత్రి జోగురామన్న కాలనీవాసులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాజీ మంత్రిని ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ గ్రామాలలో, పల్లెల్లో, పట్టణాలలో ఆధ్యాత్మికం కొరవడేలా ప్రతిఒక్కరూ ఐకమత్యంగా పండుగలను నిర్వహించుకు నేందుకు షెడ్లనిర్మాణాలను కూడా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో దేవన్న, బట్టు సతీష్, ఆశన్న, బి.శ్రీనివాస్, సీహెచ్ దినేష్, హన్మాండ్లు, వేదవ్యాస్, వెంకట్‌రెడ్డి, కల మడుగు, సంతోష్, ఎస్.కృష్ణ, నర్సాగౌడ్, పవన్, ఇబ్బు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సోషల్ మీడియా కన్వీనర్ నియామకం

బోథ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ఆర్ రవిరాజును నియమించినట్లు మండల అధ్యక్షులు ఆర్ టివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సంగు స్వామి తెలిపారు. ఇక నుంచి సోషల్ మీడియా ఇంచార్జిగా వ్యవహరించేవారు. రాష్ట్రస్థాయిలో యూనియన్ తీసుకునే నిర్ణయాలను ఎప్పటికప్పుడు సంఘ సభ్యులకు చేరవేయాల్సి ఉంటుందన్నారు. అంతేగాక గ్రూపు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సిందేనని వారు పేర్కొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు కట్టబెట్టిన సంఘం నాయకులకు సోషల్ మీడియా ఇంచార్జి కృతజ్ఞతలు తెలిపారు.

కులగణనపై వినతులు

ఉట్నూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన కార్యక్రమంలో కులగణన ఫార్మెట్‌లో నేతాని తొలగించి నేతకాని కులంగా పొందుపరచాలని డిమాండ్ చేస్తూ నేతకాని జాగృతిసంఘం నాయకులు ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బొజ్జుపటేల్‌ను కలిసి మెమోరాండం అందించి అనంతరం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాటును కలిసి వినతిపత్రం సమర్పించారు.

బౌద్ధ మతం చేర్చాలి

గుడిహత్నూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కుల గణనల్లో బౌద్ధ మతాన్ని చేర్చాలని భారతీయ బౌద్ధమ సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడపలే ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న జాడే ప్రజ్ఞాకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జై భీమ్‌నగర్, బుద్ధ విహారలో సమావేశం నిర్వహించారు.

ఇంద్రవెల్లి :ఈనెల 6 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణన సర్వేలో ఎస్సీ మహార్ కులస్తులు కాలం నెంబర్ 05లో తమ మతాన్ని బౌద్ధ మతాన్ని నమోదు చేసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్ గడపాలే అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో బౌద్ధ అనుయాయులతో సమావేశం నిర్వహించారు.

ఉట్నూర్ : బౌద్ధులుగా మారిన షెడ్యూల్డు కులాల ప్రజలకు రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని భారతీయ బౌద్ధమసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ గడపాలే, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్‌లు అన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని బౌద్ధ విహార్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కోశాధికారి, కేంద్రీయ శిక్షక్ కాం తారావు వాఘమారే కలిసి ఏర్పాటు చేసిన సమ్మైక్యంలో మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



తేమను పరిశీలిస్తున్న డివిజన్ అధికారి భాస్కర్

నర్సాపూర్(జి), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గొల్లమాడ గ్రామంలో డీసీఎంఎస్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ సహాయ సంచాలకులు డివిజన్ అధికారి భాస్కర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి వరి తీసుకువచ్చేటప్పుడు తేమశాతం 17 ఉంటే వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు పంపాలని సూచించారు. రైతులకు పట్టా బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ సెంటర్ ఇన్‌చార్జికి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాంచందర్ నాయక్, సెంటర్ ఇన్‌చార్జి గొస్కుల భూమయ్య, రైతులు ఉన్నారు.

రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

పెంబి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని ఆదివాసి గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి తొడసం శంభు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రైతు భరోసా 15 వేలు వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో రైతులను సమీకరించి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన మండల అధ్యక్షులు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల విద్యాధికారి రమణారెడ్డి

ముథోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో గల సమావేశ మందిరంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో సైతం ముందుండేలా చూడాలని పేర్కొన్నారు. అదేవిధంగా యూడైస్ అలాగే అపార్‌ను అప్డేట్ చేయించాలని పేర్కొన్నారు. ఎఫ్‌సీఎన్, ఎల్‌ఐఎఫ్ ద్వారా విద్యార్థుల అభ్యసన ప్రక్రియను వెలికి తీసి పిల్లలు విద్య పట్ల ఆకర్షితులు అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. ఎఫ్ఏ1, ఎఫ్2, ఎస్ఏ1 మార్కులను ఈడీఎస్ యాప్‌లో క్రోడీకరించాలని సూచించారు. గ్రంథాలయ పిరియడ్‌ను ప్రతి పాఠశాలలో ఉంచి ప్రభుత్వం అందించిన వివిధ పుస్తకాలను చదివించాలన్నారు. డిసెంబరు 4న కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఏఎస్ పరీక్ష 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, అమీర్ కుసురు, మోహినుద్దీన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో

తేమ కొలిచే మిషన్ బరాబర్ ఉందా ?

● అనుమానం వ్యక్తం చేసిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నర్సాపూర్(డబ్ల్యూ)లో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మిషన్‌తో ధాన్యం తేమశాతం చూస్తున్న ఏలేటి

లక్ష్మణచాంద, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మెయిచర్ మిషన్ (ధాన్యం తేమశాతం మిషన్) బరాబర్ ఉన్నదా మరి అని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం అనుమానం వ్యక్తం చేశారు. మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో గల డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మిషన్‌తోని ధాన్యం తేమశాతం చూసినప్పుడు 33 శాతం తేమ రావటంతో పై విధంగా స్పందించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా ఊసే లేదని, రైతు కూలీలకు ఇస్తానన్న సహాయం అందించనేలేదని, రుణమాఫీ పూర్తిగా అమలు జరగలేదని, పెన్షన్ మొత్తం పెంచలేదని, నూతన పెన్షన్ మంజూరు లేదని విమర్శించారు. రైతు భరోసాకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తేవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం నిల్వ చేయడానికి సరిపడా గోదాములు లేవని, వరి ధాన్యం సేకరణ కోసం ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా వ్యవహరించటం లేదన్నారు. గన్ని బ్యాగులు అందించటం నుండి మొదలుకుని ధాన్యాన్ని గోదాములకు తరలించే వరకు ఏ విషయంలోను రైతులకు ఇబ్బందులు ఎదురు కాకూడదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకి, నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, అయిండ్ల భూపాల్ రెడ్డి, సరిగెల గంగన్న, అడ్వాల రమేష్, సురకంటి ముత్యంరెడ్డి, గాండ్ల చిన్నయ్య, కాయిటి జీవన్‌రెడ్డి, అయిండ్ల శ్రీధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సోమవారం స్థానిక పడిగెల కేదార్నాథ్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ప్రముఖ పారిశ్రామిక వేత్త కేదార్నాథ్, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, పూదరి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

మామడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అహర్నిశలు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొరిటికల్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామస్థులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొరిటికల్ నుంచి పోతారం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, అలాగే వెంకటేశ్వర స్వామి దేవాలయానికి ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాపురెడ్డి, ఏలేటి చిన్న లింగారెడ్డి, రావుల రామ్‌నాథ్, పీఏసీఎస్ డైరెక్టర్ ఏలేటి చిన్నారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కోండ్ర రాజు, అధికారులు , రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

సోన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులలో నాసిరకం చేప పిల్లల విడుదల

● రాత్రి వేళలో చేపలు వదిలిన వైనం ● చెరువుల వద్ద కనబడని మత్స్యశాఖ అధికారులు ● 50 శాతం రాని చేప పిల్లలు

దస్తురాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చెరువులలో చేప పిల్లలను పంపిణీ చేస్తుంది. కానీ మండల కేంద్రంతో పాటు మండలంలోని బుట్టాపూర్, చెన్నూర్, మున్యాల్ చెరువులలో సోమవారం రాత్రి వేళలో వచ్చి నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన చెరువులో ఒక లక్ష చేప పిల్లలను పంపిణీ చేయవలసి ఉండగా కేవలం ముప్పై వేల చేప పిల్లలను చెరువులో వేసి చేతులు దుపుకున్నారు. చేప పిల్లలను చెరువులలో వేసేందుకు చెరువుల వద్దకు మత్స్యశాఖ అధికారులు రాకపోవటం, మరికొన్ని చేప పిల్లలు చెరువుల సమీపంలో చనిపోవటం కనిపించాయి.

50 శాతం చేప పిల్లలు ఇస్తున్నారు

మండలంలోని సొసైటీ చెరువులలో ప్రభుత్వం 50 శాతం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని మండల మత్స్యకార సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు.



రాత్రి వేళలో చేప పిల్లలను చెరువులో విడుదల చేస్తున్న దృశ్యం.. ఇన్‌సెట్‌లో చెరువు సమీపంలో చనిపోయిన చేప పిల్లలు

నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం

● ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

భైంసా రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం గ్రామంలో తానూర్ మండలం కోలూర్ గ్రామానికి చెందిన వారికి అన్నా బాహు సాటే కమిటీ హాల్ నిర్మాణం కోసం సుమారు రూ. 2 లక్షల ప్రొసీడింగ్ కాపీని మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి సోమవారం కుల సంఘ సోదరులకు అందజేయడం జరిగింది. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిర్మల్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కకు ముథోల్ మాజీ శాసనసభ్యుడు జి.విఠల్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సాగరబాయి, రాజన్న, తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ తులసి రామ్, గని, ధర్మేందర్, బాబు లక్ష్మణ్, గంగాధర్, వికాస్, రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాజేశ్వర్ పాండే

నిర్మల్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్రాహ్మణ ఉద్యోగ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా రాజేశ్వర్ పాండే, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర రావు దేశ్‌పాండే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గండి రామన్న క్షేత్రంలో జరిగిన బ్రాహ్మణ ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గత పది సంవత్సరాల క్రితం ఏర్పడిన తమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి నివేదికను ఈ సమావేశంలో వివరించారు. బ్రాహ్మణ భవన్ నిర్మాణం కోసం జరిగిన ఖర్చులతో పాటు అవసరమైన నిధుల వివరాలను కూడా తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా ప్రతాప్, నాగేశ్వర్‌రావు, అదనపు కార్యదర్శిగా శిరీష్ కుమార్, కోశాధికారిగా డేశ్‌కర్ భీమ్‌రావులతో పాటు ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు సహా కార్యదర్శులు, ఇద్దరు నిర్వహణ కార్యదర్శులు, ఇద్దరు సలహా సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వనభోజనం, మహిళల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

రైతు విగ్రహ ఆవిష్కరణ ఆహ్వానం అందజేత

నిర్మల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న నిర్వహించే రైతు విగ్రహ ఆవిష్కరణకు హాజరుకావాలని కోరుతూ సోమవారం ఖానాపూర్, తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘ సభ్యులు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల రాంచందర్‌లను వేరువేరుగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడు కే. రవి, కోశాధికారి ఎస్. నాగరాజు, శ్రీనివాస్, గంగాధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను

సద్వినియోగం చేసుకోవాలి

దిలావర్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు. మండలంలని గుండంపల్లిలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఏ గ్రేడ్ రూ. 2,320, కామన్ రకం రూ. 2,300ల మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ క్రింద సన్నరకం వరికి అదనంగా రూ. 500లు ధర చెల్లిస్తుందన్నారు. కాల్వ, సిర్గాపూర్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయన్నారు. రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, డైరెక్టర్ నిమ్మ సాయన్న, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కొమ్ముల దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తక్కల విద్యాసాగర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, రమణ, ఐకేపీ సీసీలు పోశెట్టి, ముత్యం, సాయన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి, వీడీసీ సభ్యులు వడ్ల నారాయణ, వీవోఏ రాములు, గ్రామ సంఘం అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడా సమాచారం



రాష్ట్రస్థాయి క్రీడలకు సిద్ధమైన కొమురంభీం ప్రాంగణం



క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

క్రీడా పండుగకు అంతా సిద్ధం

• ఉట్నూరులో నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలు • గెలుపే లక్ష్యంగా క్రీడాకారుల సాధన

ఉట్నూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న బాల బాలికల కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రీడా పండుగ కోసం ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంత్‌రావు ఆధ్వర్యంలో జిల్లా క్రీడల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. 14, 17 ఏళ్ల వయస్సులో ఉన్న విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్నా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో 1600 మంది బాల బాలికలు పాల్గొంటున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ1, ఉట్నూర్ ఐటీడీఏ 2, భద్రాచలం ఐటీడీఏ, ఏటూరు నాగారం ఐటీడీఏ, మైదాన ప్రాంతాల ఐటీడీఏ 1, మైదాన ప్రాంతాల ఐటీడీఏ 2లుగా విభజించి గిరిజన విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడల కోసం 33 జిల్లాల నుంచి గిరిజన విద్యార్థులు తరలివస్తున్నారు. ఐటీడీఏ పరిధిలో జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి తీసుకు వస్తున్నారు. విద్యార్థుల బాగోగులు చూడడంతో పాటు క్రీడలు ఆడించడానికి 567 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో క్రీడా స్థలాలను సిద్ధం చేశారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూచన మేరకు పెయింటింగ్స్ పూర్తి చేసి ప్రాంగణాన్ని సుందరీకరిస్తున్నారు.

• నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభంకానున్నాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు హాజరవుతుండగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సైతం ఈ వేడుకల్లో ప్రారంభానికి హాజరవుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క వివిధ పనుల్లో ఉండడం వల్ల రాలేక పోతున్నారని తెలుస్తుంది. ఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, అర్చరీ, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, అర్చరీ అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తెలపారు. వాలీబాల్ క్రీడల నిర్వహణ కోసం నాలుగు గ్రౌండ్లు ఏర్పాటు చేశారు. చెస్ క్యారమ్స్ ఇండోర్ గేమ్స్‌ను పీఎంఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు.



పోటీలకు ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టులు

క్రీడల్లో ఎలాగైనా గెలుస్తాం

• లక్ష్మి, అర్చరి క్రీడాకారిణి



మేము ఆదిలాబాద్ మండలంలోని మామిడిగూడ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులం. గెలుపే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నాం. రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న అనుభవం ఉండడంతో ఈ సారి కూడా విజయం సాధిస్తాం.

విజేతలుగా నిలుస్తాం

• సలోని, అర్చరీ క్రీడాకారిణి



ఆదిలాబాద్ మండలం మామిడిగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైల, పీఈటీ గోపాల్‌నా ఆధ్వర్యంలో మేము అన్నివిధాలా ప్రాక్టీస్ చేశాం. రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో తమ పాఠశాల నుంచి విజేతలుగా నిలుస్తామనే నమ్మకం ఉంది.



పోటీలకు సిద్ధం చేసిన ఖోఖో కోర్టులు



సిద్ధమైన రన్నింగ్ ట్రాక్



• పిచ్చి మొక్కలతో నిండిపోయిన చిక్మాన్ ప్రాజెక్ట్ సాగునీటి కాల్వ

అంధ్రజ్యోతి ఫోకస్



నిండుకుండను తలపిస్తున్న చిక్మాన్ ప్రాజెక్ట్

ఆనవాళ్లు కోల్పోతున్న సాగునీటి కాల్వలు

• అధ్వానంగా సాగునీటి కాల్వ • ఆయకట్టు రైతుల్లో ఆందోళన
• అక్కరకు రాని సాగునీరు • ఆయకట్టు రైతుల్లో ఆందోళన
• పట్టించుకోని సంబంధితశాఖ అధికారులు

సిరికొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాల్వలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చిక్మాన్ ప్రాజెక్ట్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నా.. పంటలకు సాగునీరు అందడం గగనంగా కనిపిస్తోంది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. సాగునీటి కాల్వల పరిస్థితి మరీఅధ్వానంగా ఉండడంతో సాగునీటిని వదిలిన నిరుపయోగంగానే మారుతుంది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో పూడిక, పిచ్చిమొక్కలు పెరిగి కాల్వలు కనిపించకుండానే పోతున్నాయి. ఏటా వానాకాల సీజన్‌కు ముందు మరమ్మతులు చేపట్టి పిచ్చిమొక్కలను తొలిగించాల్సి ఉన్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వానాకాలం సీజన్ ముగిసి రబీ పంటకాలం మొదలైంది. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకు సాగునీరు అందుతుందో లేదో అని రైతులు అయోమయానికి గురవుతున్నారు. రైతులు తమ పొలాల్లో విత్తనాలు విత్తుకొని సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. కష్టపడేతత్వం రైతుకు ఉన్నా సాగునీరు అందించే పరిస్థితి లేకపోవడంతో ఇక్కట్లకు గురవుతున్నారు. "అంగట్లో అన్నీఉన్నా అల్లుడి నోట్లో శని" అన్నట్లు పరిస్థితి తయారైంది. ఈ ఏడాది ప్రాజెక్ట్‌లో సరిపడా నీళ్లున్నా ఫలితం లేకుండా పోతోంది. నిధులు, నీళ్ల కోసమే ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలోనూ అన్నదాతల కలలు నెరవేరడం లేదు. గత ప్రభుత్వాల హయాంలో సిరికొండ మండలంలో చిన్న నీటి పారుదల ప్రాజెక్ట్ కింద చిక్మాన్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు, ఈ ప్రాజెక్ట్‌కు కుడి, ఎడమ రెండు సాగునీటి కాలువలను నిర్మించాల్సి ఉండగా కుడి వైపునే సాగునీటి కాల్వని నిర్మించి దాన్ని కూడా అసంపూర్తిగానే వదిలేశారు. దీంతో రబీ సీజన్‌లో సాగునీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో వానాకాల సీజన్‌లో వర్షాధార పంటలైన పత్తి, సోయా, కందులు, రబీ సీజన్‌లోనైతే శనగలు, మొక్కజొన్న, జొన్న, గోధుమ, పంటలను రైతులు ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటలు అంతగా దిగుబడి రాకపోవడంతో రెండో పంటపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితిలో సాగునీటి కాలువ పూర్తిగా పూడికతో నిండి నీళ్లు రాక ఆందోళన చెందుతున్నారు. అందుబాటులో పుష్కలంగా సాగునీటి వనరులున్నా సద్వినియోగం లేకపోవడంతో కొందరి రైతుల భూములన్నీ బీడువారిపోతున్నాయి. ప్రతీఏటా వానాకాల సీజన్‌లో వర్షాధారంగా పంటలు సాగవుతున్నా రబీలో మాత్రం అక్కడక్కడ బోరుబావులు, చెరువులు, కుంటల కింద నీటిలభ్యతను బట్టి పంటలను సాగుచేయాల్సి వస్తోంది. ప్రస్తుత రాష్ట్రఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా గత ఏడాది మార్చి నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిక్మాన్ ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులు చేపడతామని మండలవాసులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు సిరికొండలో చిక్మాన్ ప్రాజెక్ట్ ఎత్తు పెంచడంతోపాటు సాగునీటి కాలువలను పొడిగించి బీడు భూములన్నింటినీ సస్యశ్యామలం చేస్తామని అసెంబ్లీ వేదికగా ఇటీవల ఆదిలాబాద్‌లోని ఇంద్రవెల్లి, పిప్పిరిలో నిర్వహించిన సభల్లో కూడా పేర్కొన్నారు.

• సాగయ్యేది 500 ఎకరాలే..

చిక్మాన్ ప్రాజెక్ట్ ఆయకట్టు విస్తీర్ణం 3వేల ఎకరాలు కాగా రబీ సీజన్‌లో ప్రస్తుతం 500 ఎకరాలకు మించి సాగు అయ్యే అవకాశం లేకుండా పోతోంది. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.18కోట్లతో నిర్మించిన చిక్మాన్ ప్రాజెక్ట్‌కు కుడి, ఎడమ కాలువలు నిర్మించాల్సి ఉన్నా కుడి కాల్వను మాత్రమే నిర్మించి వదిలేశారు. కుడి సాగునీటి కాలువ ద్వారా దాదాపు 1600 ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉన్నా కాలువ పూర్తిగా పూడిక, చెట్ల పొదలతో నిండిపోయి సాగునీరు అందక దాదాపు 500 ఎకరాలు కూడా సాగుచేసే పరిస్థితి లేకుండాపోతోంది. ప్రాజెక్ట్‌లోకి పైనుంచి వరదనీరు వచ్చి చేరడంతో జలాశయం పూర్తిగా మట్టితో నిండిపోయి, నీరు నిల్వ ఉండడం లేదు. ప్రాజెక్ట్ ఎత్తు తక్కువగా ఉండడంతో పైనుంచి వచ్చిన నీరు వచ్చినట్లే కిందికి వెళ్లిపోతుంది. సాగునీటి కాలువకు సరైన తూములు లేకపోవడం, కాలువ తెగిపోయి నీరంతా వృథాగా పోతుండడంతో ఆయకట్టు రైతుల పొలాలకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు ఇటువైపు దృష్టిసారించి చిక్మాన్ ప్రాజెక్ట్ ఎత్తు పెంచి, సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

• గోర్బండ్ నారాయణ, రైతు సిరికొండ



ప్రాజెక్ట్‌లో సాగుకు సరిపడా నీళ్లున్నా పంటల కు అందడం గగనంగానే కన్పిస్తోంది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా కాల్వలు అధ్వానంగా ఉండడంతో సాగునీటిని వదిలినా నిరుపయోగంగానే ఉంటుంది. కాల్వలో పూడిక, పిచ్చిమొక్కలను కూడా తొలిగించే ప్రయత్నం చేయడం లేదు. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీగా పూడిక పేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అం దడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం

• తిరుపతి, ఇరిగేషన్ ఏఈఈ

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల చిక్మాన్ ప్రాజెక్ట్ కుడి సాగునీటి కాల్వలో పూడిక భారీగా చేరడం వల్లనే రైతుల పొలాలకు నీరు అందడం లేదు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా త్వరలోనే సాగునీటి కాల్వలో చేరిన పూడిక, పిచ్చిమొక్కలను తొలిగించి సాగునీటిని అందేలా చర్యలు తీసుకుంటాం.

శ్రీవైష్ణవ ఆయుత చండీ యాగానికి ఏర్పాట్లు

• ఈనెల 8 నుంచి 25 వరకు నిర్వహణ • శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆశీర్వచనాలతో యాగ మహోత్సవం

భక్తి

నిర్మల్‌కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాకేంద్రంలో శ్రీవైష్ణవ అయుత చండీ యాగ నిర్వహణకు భారీఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామి పర్యవేక్షణలో ఈనెల 8 నుంచి 25 వరకు ఎస్పీ కార్యాలయం ఎదుట యాగాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 10న సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవం, 12న సుబ్రహ్మణ్య స్వామి, 14న సీతారామ కల్యాణోత్సవం, 18న ఉమామహేశ్వర కల్యాణోత్సవం, 20న లక్ష్మీ నరసింహ కల్యాణోత్సవం సాయంత్రం 6గంటలకు నిర్వహించనున్నారు. 17నలక్ష దీపోత్సవం, 23న శ్రీసుదర్శన శతక హోమం, వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 25న పూర్ణాహుతి ఉంటుంది. కుంకుమార్చన, లక్ష దీపోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



యాగశాల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు



సదస్సులో పాల్గొన్న ఇంజనీర్లు

ఆర్జీయూకేటీలో కృత్రిమ మేధస్సుపై అవగాహన

బాసర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ చండీగఢ్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే ఇంజనీరింగ్ విద్యలో కృత్రిమ మేధస్సు అనే అంశంపై అవగాహన సదస్సు సోమవారం ప్రారంభమైంది. అధ్యాపకులు విద్యార్థులకు కృత్రిమ మేధస్సు పై సదస్సును నిర్వహించడం గొప్ప పరిణామమని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి తెలిపారు. కృత్రిమ మేధస్సు ఇంజనీరింగ్ రంగాలలో ఏవిధంగా ఉపయోగపడుతుంది. ప్రాజెక్టు నిర్వహణ వనరుల కేటాయింపులో కృత్రిమ మేధస్సును వాడటం, భద్రతా వ్యవస్థలు, డిజైన్ టూల్స్ తయారీ, ఆటో మేషన్ ఇంజనీరింగ్ రోబోటిక్స్‌లో ఏఐ పాత్ర, పర్యావరణ అనుకూల పద్ధతులు ప్రోత్సహించడంలో ఏఐ స్థానం తదితర అంశాల గూర్చి సదస్సులో ఆచార్యులు, ప్రత్యేక నిపుణులతో చర్చ జరుగుతుందని సమన్వయకర్త డాక్టర్ రాకేష్‌నామాని వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మున్సిపల్ ఈఈపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అవినీతికి పాల్పడుతున్న ఈఈ తిరుపతిపై చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అన్నారు. సోమవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఈఈపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఉన్నారు.

'ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని బేల మండల కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బేల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇటీవల బేల మండలకేంద్రంలో ప్రభుత్వం అందించే దండారి ఉత్సవాల చెక్కుల పంపిణీలో ఐటీడీఏ అధికారులు సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫొటోలు పెట్టలేదన్నారు. దీనిపై వారిని ప్రశ్నిస్తే ఎదురు తిరిగారని ఆరోపించారు.

శాంపిళ్లను ఎప్పటికప్పుడు నిర్ధారణ చేయాలి

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలోని మలేరియా ల్యాబ్‌ను జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ మిట్పల్లివార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని జ్వరం కేసులకు సంబంధించిన నమూనాలతో పాటు సేకరణ తీరును పరిశీలించి ఆయన పలు సూచనలు చేశారు. అంతేకాకుండా ఆసుపత్రిలో రికార్డులను సైతం పరిశీలించి శాంపిల్స్‌ను ఎప్పటికప్పుడు నిర్ధారణ చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఆయన వెంట ల్యాబ్ టెక్నీషియన్ రమణ చారి, ఎంటీఎస్ అనిల్ కుమార్, తదితరులు ఉన్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరించాలి

ఉట్నూర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, ఏవో దామోదర స్వామిలు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. జైనథ్ మండలం జైనథ్ గ్రామానికి చెందిన రాము భూమి పట్టా మంజూరు కల్పించామని, ఆదిలాబాద్ మండలం దోతిగూడ గ్రామానికి చెందిన దేవరావు తమ గుస్సాడి కోసం డబ్బులు మంజూరు చేయాలని, తిర్యాణి ఇంద్రవెల్లి మండలం ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన మౌనిక ఏఎన్ఎం ఉద్యోగం కల్పించాలని, అలాగే పలువురు తమ సమస్యలను విన్నవించారు ఇందులో ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి, జేడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్ధం చేసిన కొమురంభీం మైదానం

క్రీడా పండుగకు సర్వం సిద్ధం

- ఉట్నూర్‌లో నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రీడలు
- గెలుపే ఆశయంగా క్రీడాకారుల ప్రాక్టీస్
- తరలివస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల బాలబాలికలు

7



పూడికతో నిండిపోయిన సాగునీటి కాల్వ

అధ్వానంగా సాగునీటి కాలువలు

- అదును దాటిపోవడంతో ఆయకట్టు రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

7

సర్వేపనులు కేటాయించారని ఆందోళన

- తలమడుగు శిక్షణ శిబిరంలో నిరసన తెలిపిన ఉపాధ్యాయులు

6లో

● పెన్‌గంగా నదిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారిలా..(ఫైల్)



ఇసుక రీచ్‌లపై మాఫియా.. కన్నెస్త

- జిల్లాలో అక్రమ తవ్వకాలకు మైనింగ్ మాఫియా ప్లాన్
- పెన్‌గంగా నదిలో తగ్గుముఖం పడుతున్న వరదనీరు
- వేలం పాటలకు సిద్ధమవుతున్న గ్రామాభివృద్ధి కమిటీలు
- సరిహద్దు మండలాల్లో రాజకీయ నేతలదే పెత్తనం
- తాజాగా మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన బేల మండలవాసులు
- జిల్లా అధికార యంత్రాంగానికి ముందుచూపు కరువు



ఆదిలాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెన్‌గంగ నదిలోని ఇసుక రీచ్‌లపై కన్నేసినా మైనింగ్ మాఫియా అక్రమంగా ఇసుక తవ్వకాలను చేపట్టేందుకు ప్లాన్ వేస్తున్నారు. ఈ యేడు సమృద్ధిగా వర్షాలు కురవడంతో పెన్‌గంగా నదిలో పుష్కలంగా ఇసుకమేటలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో ఇసుకకు మంచి డిమాండ్ ఉండడంతో సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో ఇసుక రవాణాకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకుంటు రవాణా చేస్తున్నారు. అయితే అడపదడప అధికారులు దాడులు చేస్తున్న రాజకీయ పరపతి, ఆర్థిక పలుకుబడితో అధికారులు అటువైపు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. పోలీసుల తనిఖీల్లో వాహనాలు పట్టుబడుతున్న పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. నిత్యం పట్టపగలే అక్రమంగా ఇసుకను తరలిస్తూ అమ్మేసుకుంటున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు అడ్డుకోక పోవడంపై అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. సరిపడా సిబ్బంది లేరన్న సాకుతో మైనింగ్ శాఖ చేతులెత్తేయడంతో రెవెన్యూ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇలా శాఖల మధ్య సమన్వయం కొరవడడంతో యేటా కోట్ల రూపాయల విలువ చేసే ఇసుక నిలువలు కనిపించకుండానే పోతున్నాయి. సోమవారం అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాలని బేల మండలంలోని పలు గ్రామాల ప్రజలు జిల్లా మైనింగ్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఆదేశించిన క్షేత్ర స్థాయిలో పరిస్థితులు దానికి భిన్నంగా కనిపిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు ముందుచూపుతో వ్యవహరిస్తేనే.. ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయమై జిల్లా మైనింగ్ శాఖాధికారిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించ లేదు.

అభివృద్ధి పేరిట దందా

పెన్‌గంగా నదిలో వరద నీటి ఉధృతి కొంత తగ్గుముఖం పట్టడంతో ఇసుక రీచ్‌లను దక్కించుకునేందుకు మైనింగ్ మాఫియా ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడక్కడ వరదనీటిలో నుంచే ఇసుకను తోడి అమ్మేసుకుంటున్నారు. పెన్‌గంగా నది సరిహద్దుల్లో ఉన్న గ్రామ వీడీసీలు వేలం పాటలు నిర్వహిస్తూ అనాధికార దోపిడీకి తెరలేపుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్ మండలం, జైనథ్, బేల, ఇచ్చోడ, ఉట్నూర్, భీంపూర్, తాంసి మండలాల్లోని పలు గ్రామాల్లో అనధికారికంగా ఇసుక టెండర్లు నిర్వహిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నట్లు వినిపిస్తోంది. కొన్ని చోట్లయితే రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇసుక రీచ్‌లకు డిమాండ్ కనిపిస్తోంది. గ్రామాభివృద్ధి పేరిట టెండర్లు నిర్వహిస్తున్నామని చెబుతూ.. ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతున్నారు. టెండర్లు దక్కించుకున్న వ్యాపారులు జిల్లాకేంద్రానికి ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్ ఇసుకను రూ.3వేల నుంచి రూ.5వేల వరకు అమ్మేసుకుంటున్నారు. జిల్లాకేంద్రంలోని పంజాబ్ చౌక్, రిమ్స్ ఆసుపత్రి, తిర్పెల్లి వద్ద ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. అయిన రెవెన్యూ అధికారులకు పట్టింపే లేకుండా పోయిందన్న విమర్శలు వస్తున్నాయి.

అధికార ప్రతిపక్ష నేతలే సూత్రధారులు

పెన్‌గంగా నది పరివాహక ప్రాంత మండలాలైన తలమడుగు, తాంసి, భీంపూర్, జైనథ్, బేల మండలాల్లో ఇసుక దందా అధికార, ప్రతిపక్ష నేతల కనుసన్నల్లోనే కనిపిస్తోంది. కొందరు నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెరవెనక

(మిగతా 6వ పేజీలో...)

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : ఎంపీ గోడంనగేష్

జైనథ్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్‌లు స్పష్టం చేశారు. సోమవారం జైనథ్ మండలంలోని మాకోడ ఎక్స్‌రోడ్డు నుంచి బేల మండల కేంద్రం వరకు రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించే ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను అధికారులు నాయకులతో కలిసి కాప్రీలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాప్రీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వారు హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో మాత్రమే పార్టీలు అని తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం వైపు దృష్టి సారించే విధంగా చూడాలన్నారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రహదారులు తప్పనిసరి అని అభివృద్ధికి సూచిక అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంటే కేంద్ర నిధులతోనే స్మశాన వాటిక, రైతు వేదిక, ఎన్ఆర్ఈజీఎస్ తదితర అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఆదిలాబాద్ ఈఈ ఎస్.నర్సయ్య, డీఈ రమేష్, ఏఈ ప్రవీణ్, జైనథ్ మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో జి.వెంకట్‌రాజ్, బీజేపీ మండల అధ్యక్షులు కె.రాందాస్, నాయకులు ఎల్టి అశోక్‌రెడ్డి, మార్కండి, దంతల రవీందర్ పాల్గొన్నారు.



రోడ్డుపనులు ప్రారంభోత్సవం చేస్తున్న ఎంపీ,ఎమ్మెల్యేలు

ఆదివాసీల సంస్కృతి గొప్పది : ఎంపీ

భారతదేశంలోని ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు గొప్పవని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని బెల్లూరిగూడలో ఆదివాసీలు గిరిజనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున దండారి చెక్కులను ఒక్కో గ్రూపు రూ.15వేల చొప్పున ఆరు దండారి గ్రూపులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గిరిజనులకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ విలాష్‌పటేల్, డైరెక్టర్ బాససంతోష్, జైనథ్ మండల తహ సీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీఓ జి.వెంకట్‌రావ్ పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులసర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులసర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు మున్సిపల్, గ్రామస్థాయిలో వార్డు నుంచి మొదలుకొని కేటా యించిన బ్లాక్‌స్థాయి వరకు పూర్తిస్థాయిలో సమాచార సేకరణ, నమోదును అత్యంత జాగ్ర త్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే నిర్వహణలో ఏవైనా సందేహాలు తలెత్తి నట్లయితే వెంటనే నివృత్తి చేసుకోవాలని ఆయన సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేకు అత్యంత ప్రాధా న్యత ఇస్తున్నదని, అలాగే సర్వే నిర్వహణ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలి పారు. ఈ సర్వేలో అందరిని భాగస్వామ్యం చేయాలని, ఎన్యుమరేటర్లుగా నియమించిన టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. బుధవారం నుం చి ప్రారంభంకానున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆర్డీవో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్

అర్జీలు పెండింగ్ లేకుండా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ మండలాల నుంచి 84 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందిస్తూ తక్షణమే పరిష్క రించాలని ఆయన ఆదేశించారు. పంచాయతీ, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్య, వైద్య, పెన్షన్ తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఫిర్యాదుల విభాగంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా

ఆదిలాబాద్‌రూరల్, నవంబర్ 04 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించినప్పటికీ వారికి ఐదునెలల నుంచి మినీటీచర్ల వేతనం ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత అన్నారు. మినీటీచర్లకు మెయిన్ టీచర్ల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అదేవిధంగా కుల గణననుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

● జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ● బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

బోథ్, మావల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోథ్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ మృతితీరని లోటని ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. ఆదివారం అస్వస్థతకు గురై ఆసుపత్రిలో రమణారెడ్డి మృతిచెందిన విషయా న్ని తెలుసుకుని ఆయన స్వగ్రామమైన వాగాపూర్‌కు సోమవారం వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రమణారెడ్డి మృతి వల్ల కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని, పోలీసులు శాఖ తరపున అన్ని విధాలుగా సహకారం ఉంటుందని ఆయన అన్నారు. తక్షణ సహాయం కింద రూ.20 వేలు అందించడంతో పాటు భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, బోథ్ సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్, అప్పారావు, అశోక్‌లతో పాటు పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయి..

ఆదిలాబాద్‌అర్బన్ : తాంసి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొందిన మహమ్మద్ అబ్దుల్‌రౌఫ్ సోమవారం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంను పోలీసు ముఖ్య కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏఎస్సైగా పదోన్నతి పొందిన అబ్దుల్‌రౌఫ్‌కు పదోన్నతి చిహ్నం స్టార్‌ను భుజాల పై అలంకరించి అభినందనలు తెలియజేశారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

దళారులను నమ్మి మోసపోవద్దు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండలంలోని చౌరస్తాలో వద్ద గల మిత్తల్ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల పత్తికొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ ఈవో దేవన్న, మండల వ్యవసాయ అధికారి రాథోడ్ గణేష్, ఆర్ఐ మెస్రం లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, మాజీ సర్పంచ్ కోరెంగ సుకంట్‌రావు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

● ఆదివాసీల సంక్షేమానికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేకకృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్ హాల్‌లో 50 గుస్సాడీ దండా రీ ఉత్సవాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసులు భక్తి శ్రద్దలతో జరుపుకునే పండుగ దండారి అని పేర్కొ న్నారు.

త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించండి

సిరికొండ : మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌ను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని వాయిపేట్, చిమ్మన్‌గుడి, భీంపూర్, కుంటగూడ, సూర్య పేట్, చింతగూడ, రాంనగర్ తదితర గ్రామాల్లోని పంటపొలాల్లో బోరుబావులున్నప్పటికీ త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రబీ సీజన్‌లో పంటలు పండించడం ఇబ్బందిగా మారుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.